అన్నదాతల్లో కలవరం

- భయపెడుతున్న అల్పపీడనం
- కోత దశలో వరి పంట
- పలుచోట్ల రోడ్లపై రాశులుగా ధాన్యం
- ఇప్పటికే కొవ్వూరు డివిజన్‌లో 5,553 హెక్టార్లలో వరి కోతలు



దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద హైవే సర్వీసు రోడ్డుపై ధాన్యం రాశులపై బరకాలు కప్పి భద్రపరిచిన రైతులు



గౌరీపట్నం వద్ద రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు

దేవరపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అన్నదాతను కలవరపెడుతోంది.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రస్తుతం వరికోతలు, పొగాకు నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ దశలో భారీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటాయి. గత 10 రోజులుగా కొవ్వూరు డివిజన్‌లోని పలు మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. అలాగే పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల కింద వర్జీనియా పొగాకు నాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 20 వేల ఎకరాల్లో పొగాకు నాట్లు వేసినట్టు అధికారుల అంచనా. ఇప్పటి వరకూ జిల్లాలో 12,159 హెక్టార్లలో వరి కోతలు పూర్తయినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. కళ్లాల సదుపాయం లేకపోవడంతో కోసిన ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టి మిల్లర్లకు విక్రయిస్తున్నారు. దేవరపల్లి, గౌరీపట్నం, యర్నగూడెం, త్యాజంపూడి, కృష్ణంపాలెం, సూర్యనారాయణపురం, ఐ. పంగిడి, కొవ్వూరు రూరల్ ప్రాంతాల రైతులు గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారి సర్వీసు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి మబ్బులు కమ్ముకోవడమే గాకుండా, అక్కడక్కడా వర్షపు జల్లులు పడుతున్నాయి. దాంతో రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పి తడవకుండా జాగ్రత్త పడ్డారు. భారీ వర్షం కురిస్తే బరకాల అడుగు భాగం నుంచి నీరు ధాన్యపు రాశుల్లోకి వెళ్లి తడిసి పోతుందని వారు భయపడుతున్నారు.



గౌరీపట్నంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేను

రైతులకు కళ్లాల సమస్య

ధాన్యం రైతులకు కళ్లాల సమస్య ఎక్కువగా ఉంది. కోసిన ధాన్యాన్ని గతంలో పొలాల్లో పనలపై ఆరబెట్టి కుప్పలు వేసి నిల్వ చేసేవారు. మార్కెట్లో గిట్టుబాటు ధర వచ్చినపుడు కుప్పలను నూర్చి ధాన్యాన్ని అమ్ముకొనే వారు.కొన్నేళ్లుగా పొలాల్లో కళ్లాలు ఏర్పాటు చేయడం, కుప్పలు వేయడం రైతులు మానుకున్నారు. యంత్రాల ద్వారా వరి పంటను కోసి ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే రోడ్లపైకి తీసుకువచ్చి ఆరబెట్టి రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పొలాల్లో కళ్లాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. అకాల వర్షాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బరకాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

5,553 హెక్టార్లలో వరి కోతలు

కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్‌లో 37,287 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ 5,553 హెక్టార్ల విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. మండలాలవారీగా చాగల్లులో 718, దేవరపల్లిలో 530, గోపాలపురంలో 84, కొవ్వూరులో 1677, నిడదవోలులో 1161, పెరవలిలో 212, తాళ్లపూడిలో 500, ఉండ్రాజవరంలో 210, నల్లజర్లలో 641 హెక్టార్ల విస్తీర్ణంలో వరి కోతలు జరిగాయి.

వరి పంట కోయవద్దు



అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. వరి చేలు కోసి రోడ్లపై ఆరబెట్టవద్దు. రోడ్లపై ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుని, అవకాశం ఉన్నంత వరకూ మిల్లులకు తరలించాలి. కొవ్వూరు డివిజన్‌లో చాలామంది రైతులు ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం తడిస్తే తేమశాతం పెరుగుతుంది. దీనివల్ల రైతులు గిట్టుబాటు ధర కోల్పోతారు. ఆగస్టులో కురిసిన భారీ వర్షాల వల్ల వరి నాట్లు ఆలస్యం కావడంతో కోతలు ఆలస్యంగా జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలించే వరకూ కోతలను నిలుపుదల చేయాలి.

– పి. చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

క్లుప్తంగా

సోమేశ్వర ఆలయంలో ఆకాశదీపం



నిడదవోలు సోమేశ్వర ఆలయంలో ఆకాశదీపం కార్యక్రమంలో భక్తులు

నిడదవోలు: కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని శైవ క్షేత్రాల్లో విశేష పూజలు జరిగాయి. భక్తులు ముక్కంటికి అభిషేకాలు చేశారు. పట్టణంలోని పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే గల చిన కాశిరేవులో వేకువజామున గంగా స్నానాలు ఆచరించిన భక్తులు శైవ క్షేత్రాలకు చేరుకుని విశేష పూజలు చేశారు. స్థానిక పురాతన రాజ రాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి వార్ల ఆలయాల్లో భక్తులు నిత్యాభిషేకాలు, అమ్మవారికి పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు లక్ష్మీనరసింహస్వామి, ఈవోలు సోమాల శివ, నామా సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు అధికారులకు శిక్షణ

పెరవలి: గ్రామ పంచాయతీలకు 2025–26 ఆర్థిక సంవత్సరపు వార్షిక ప్రణాళిక సిద్ధం చేసే అంశంపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, అన్ని పంచాయతీల సిబ్బంది, డ్వాక్రా సభ్యులు హాజరు కావాలన్నారు.

సమిశ్రగూడెంలో అయ్యప్పల పడిపూజ

నిడదవోలు రూరల్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సమిశ్రగూడెం గ్రామంలోని పర్వత వర్ధిని సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం అయ్యప్ప స్వాముల పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి అష్టోత్తరాలు, భజన కీర్తలనతో మార్మోగింది. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేశారు. గురుస్వాములు ఏర్పాటు చేసిన సెట్టింగ్ ఆకర్షణగా నిలిచింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

వెలగదుర్రులో లక్ష పత్రి పూజ, శాంతి కల్యాణం

ఉండ్రాజవరం: కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని వెలగదుర్రు గ్రామంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్షపత్రి పూజ, శాంతి కల్యాణ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ముదునూరి రవీంద్రరాజు స్వామి వారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజారోగ్యం మన గురుతర బాధ్యత

అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వసుంధర



పోతవరం పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ వసుంధర

నల్లజర్ల: ప్రజలకు వైద్య సేవలు అందించి, వారి ఆరోగ్యానికి రక్షణ కల్పించాల్సిన గురుతర బాధ్యత మనదని వైద్య,ఆరోగ్య శాఖ అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.వసుంధర వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీలను సందర్శించారు. ఎయిడ్స్, క్షయ, కుష్ఠు వ్యాధుల నివారణ అధికారి అయిన ఆమె ఈ రెండు పీహెచ్‌సీలలోని ఆయా రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పోతవరం పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న శామ్స్ (సోషల్ ఎవేర్‌నెస్ న్యూమోనియా యాక్షన్ సక్సెస్ పుల్లీ) శిక్షణను సమీక్షించారు. మంగళవారం ప్రారంభమై, 2025 ఏడాది ఫిబ్రవరి 28 వరకూ కొనసాగే ఈ కార్యక్రమంపై సర్వే నిర్వహించనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ ఆమెకు తెలిపారు. రోగులకు పాలు, గుడ్లు అందజేశారు. వసుంధర వెంట డాక్టర్ గంగాధరరావు, సీహెచ్‌ఓ ప్రసాద్, డీపీఎంఓ వెంకట్రావు, గాలింకి ఆశాజ్యోతి, సత్యం,జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో బతుకు భారం

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుందర్‌బాబు
- చాగల్లులో ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ



చాగల్లులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చాగల్లు: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8 నుంచి 14 వరకూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందర్‌బాబు చెప్పారు. చాగల్లు బస్టాండ్ సెంటర్ వద్ద మంగళవారం ప్రజాపోరు పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఆ పార్టీ నాయకులు చాగల్లు వాసులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సుందర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయన్నారు. హద్దూ,అదుపూ లేకుండా నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని విమర్శించారు. తక్షణం విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల బిగింపు యత్నాలను విరమించుకోవాలని ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపైన, దళితుల పైనా కొనసాగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి దుర్గారావు, గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, ఎస్.ఆదాం, కొండయ్య తది తరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం



నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

నల్లజర్ల: విధి నిర్వహణలో ఉండగా విద్యుత్ షాక్ వల్ల తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న అనంతపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కొవ్వూరి దుర్గాప్రసాద్‌ను వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి మండల కమిటీ మంగళవారం పరామర్శించింది. మూడు వారాలుగా ఏలూరు చైత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్‌ను సమితి మండల కమిటీ సభ్యులు పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఉపాధ్యాయుడు బొండల శ్రీనివాస్ మరో రూ.5వేలు సాయంగా అందించారు. కార్యక్రమంలో గుదే గోపాలకృష్ణ, వీరవల్లి అనిల్‌కుమార్, పిల్లి కాంతారావు, గుదే శ్రీనివాస్,అందుగుల వెంకటేశ్వరావు, అప్పన్న పాల్గొన్నారు.

15న ఆబోతు వెంకన్నబాబు తీర్థం

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఆబోతు వెంకన్నబాబు తీర్థం నిర్వహిస్తారు. ఏటా కార్తిక పౌర్ణమి నాడు వెంకన్నబాబుకు ప్రతి రూపంగా ఆంబోతు తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలకు పరిసర మండలాల అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. 15న తీర్థం, 16న శ్రీపుష్పయాగంతో తీర్థం ముగుస్తుంది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీర్థం , ప్రత్యేక పూజలు, గోదావరి నదిలో చక్రతీర్థం నిర్వస్తున్నట్టు ఆలయ అర్చకుడు పెరవలి సత్యప్రసాద్ చెప్పారు. కులమతాలకు అతీతంగా అన్ని మతాల వారూ ఈ ఉత్సవాల్లో పాల్గొనడం మరో ప్రత్యేకత. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రంగుల రాట్నాలు, జెయింట్ వీల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కైగాల సూర్యచంద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పొగాకు సాగు నియంత్రణ పాటించాలి

- పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ప్రసాద్
- గోపాలపురంలో రైతులకు అవగాహన సదస్సు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ ప్రసాద్

గోపాలపురం: వర్జీనియా పొగాకు సాగు చేసే రైతులు పంట నియంత్రణ పాటించాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. పొగాకు పంట నియంత్రణ– రైతులు పాటించాల్సిన పద్ధతులపై మంగళవారం స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి డి.అమ్మూల్ శ్యామ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఆర్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు బోర్డు సూచించినట్టుగా బ్యారన్‌కు 41 క్వింటాళ్ల పొగాకును మాత్రమే పండించాలన్నారు. అదనపు పొగాకు ఉత్పత్తిపై భారీ జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా బోర్డు ఉత్తర్వుల మేరకు నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేసి, గిట్టుబాటు ధరలు పొందాలన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. సదస్సులో ఐటీసీ లీఫ్ మేనేజర్ ఎం.రఘు, రైతు నాయకులు ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్, గద్దే శేషగిరిరావు, పరిమి జగదీష్ రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



నల్లజర్లలో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న విద్యార్థినులు

నల్లజర్ల: పూర్వపు ఉభయ గోదావరి, పూర్వపు కృష్ణా జిల్లాలకు చెందిన 624 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు బుధవారం నుంచి 21వ తేదీ వరకూ నల్లజర్లలోని ఏకేఆర్జీ హైస్కూల్ మైదానంలో శిక్షణ ఇవ్వనున్నట్టు 19వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే మంగళవారం తెలిపారు. మూడు జిల్లాల్లోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 12 కళాశాలలకు చెందిన 205 మంది బాలికలు, 419 మంది బాలురు హాజరవుతారన్నారు. ఇందులో 8, 9, 10, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఈ శిక్షణలో ఏబీసీ సర్టిఫికెట్‌కు క్యాడెట్లు అర్హత సాధిస్తారన్నారు. అలాగే 2026 జనవరిలో ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే క్యాడెట్లను కూడా ఈ మూడు జిల్లాల వారి నుంచి ఎంపిక చేసి, వివిధ రకాల శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. వచ్చే రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనేందుకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఆరుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికైనట్టు తెలిపారు. వారికి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ శిక్షణలో ఎన్‌సీసీ సూపరింటెండెంట్ కొండయ్యతో పాటు ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు 8 మంది, పీఐ స్టాఫ్ 12 మంది, ఆఫీసర్లు 15 మంది పాల్గొంటారన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు నలుగురి ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కొయ్యల ప్రసాద్, పరిమి హరిచరణ్

కొవ్వూరు: స్కూల్‌గేమ్స్ అండర్–14 బాలబాలికల వాలీబాల్ జాతీయస్థాయి పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకూ విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో ఈ నలుగురూ చక్కటి ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. ఈ క్రమంలో వారు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర జట్టుకు బాలికల విభాగంలో జంగారెడ్డిగూడేనికి చెందిన మానికల మహాలక్ష్మి, ధర్మవరం గ్రామానికి చెందిన కడియం మహాశ్రీలక్ష్మి ఎంపికయ్యారు. బాలుర జట్టుకు దుద్దుకూరుకు చెందిన పి.నవీన్‌కుమార్, కొవ్వూరు పట్టణానికి చెందిన యు.ప్రవీణ్‌లు ఎంపికయ్యారన్నారు. ఈ నలుగురు విద్యార్థులూ కొవ్వూరులోని గౌతమీ వాలీబాల్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందినట్టు తెలిపారు. గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ విద్యార్థులను అభినందించారు. డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ నలుగురూ ఆంధ్రప్రదేశ్ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఈ క్రీడాకారులకు శిక్షణ అందించిన కె.రామ్‌కుమార్, పి.సత్యనారాయణ, ఆర్ సురేష్, పి.గంగాధర్‌లను అభినందించారు.

19న మద్యం షాపుల్లోని వస్తువులకు బహిరంగ వేలం

చాగల్లు: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్బీసీఎల్) చాగల్లు డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు చెందిన వస్తువులను ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్బీసీఎల్ చాగల్లు డిపో మేనేజర్ (ఇన్‌చార్జి) ఎం. రామకృష్ణదాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూప రింటెండెంట్, ఏపీఎస్ బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో చాగల్లులోని డిస్టిలరీ కాంపౌండ్‌పక్కనే గల ఏపీఎస్బీసీఎల్ గోడౌన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. ఈ వేలంలో 117 ఫ్రీజర్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.22,680), 117 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.18,630), 117 క్యాష్ చెస్ట్‌లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.6,120), 117 స్కానర్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.3,400), 117 క్యాష్ కౌంటింగ్ మెషీన్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.1200) వేలం వేస్తామన్నారు. ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడే ప్రకారంగా వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి, దరఖాస్తు రుసుంగా రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాట పాడుకోనివారికి దరఖాస్తు రుసుము తిరిగి చెల్లిస్తారన్నారు. పూర్తి సమాచారం కోసం 96767 14547, 99493 51050 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలుడి వైద్యానికి రూ.20 వేల సాయం

దేవరపల్లి: దీపావళి సందర్భంగా దేవరపల్లిలో బాణసంచా నిప్పు రవ్వపడి దాసుపల్లి ఏడుకొండలు అనే బాలుడి కన్ను దెబ్బతింది. ఆ బాలుడి వైద్య ఖర్చులకు జనసేన పార్టీ దేవరపల్లి శ్రేణులు మంగళవారం రూ. 20 వేల ఆర్థికసాయాన్ని అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అక్రమంగా ఇసుక విక్రయిస్తే కఠిన చర్యలు

అర్ధరాత్రి ర్యాంపులు తనిఖీ చేసిన ఆర్డీఓ



పెండ్యాల ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, అధికారులు

నిడదవోలు రూరల్: అక్రమంగా ఇసుక విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత హెచ్చరించారు. మండలంలోని పెండ్యాల, జీడిగుంట, పందలపర్రు ఇసుక ర్యాంపులను సోమవారం రాత్రి 11.30 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకూ ఆర్డీఓ సుస్మిత ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ చెప్పారు. నిబంధనల ప్రకారం ఇసుక లోడింగ్ చేస్తున్నామన్నారు. పట్టణ ఎస్సై శోభన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవరపల్లి: స్థానికంగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తి గాయపడినట్టు తెలిసింది. గాయపడిన వ్యక్తిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. ప్రమాదంపై ఎటువంటి సమాచారం రాలేదని దేవరపల్లి పోలీస్ స్టేషన్ రైటర్ చక్రవర్తి తెలిపారు.

మహిళను గాయపరిచిన కేసులో ఇద్దరిపై కేసు

కొవ్వూరు: దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన బొంతా కుమారి అనే మహిళను ఆమె సమీప బంధువులు కర్రతో కొట్టి గాయపరిచారు. వరుసకు బావ, తోటి కోడలు తనను కొట్టినట్టు కుమారి కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మంగళవారం ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు.

పారిశ్రామికవేత్త జీవీ ప్రసాద్‌కు స్టార్ ప్రింటర్ అవార్డ్



హైదరాబాద్‌లో స్టార్ ప్రింటర్ అవార్డ్ అందుకుంటున్న పారిశ్రామికవేత్త జీవీ ప్రసాద్

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన పారిశ్రామికవేత్త జీవీ ప్రసాద్‌కు స్టార్ ప్రింటర్ అవార్డ్ లభించింది. తెలంగాణలో పలు ప్యాకింగ్ పరిశ్రమలు నిర్వహిస్తున్న ప్రసాద్ హైదరాబాద్‌లోని హైటెక్స్ వద్ద నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఈ అవార్డ్ స్వీకరించారు. తెలంగాణలో శ్రీసాయిరామ్ ప్రింట్ ప్యాక్ కంపెనీ నిర్వహిస్తున్న ఆయనకు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం అందింది. తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ తరపున ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రసాద్ స్టార్ ప్రింటర్ అవార్డును విదేశీ ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు గ్రహీత ప్రసాద్‌ను పారిశ్రామికవేత్త అల్లూరి విక్రమాదిత్య, అన్నదేవరపేటకు చెందిన కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి కృష్ణ, కూచిపూడి లక్ష్మణరావు తదితరులు అభినందించారు.